సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 16 । మార్చి । 2025



నియమావళితోనే సజావుగా పరీక్ష

పదో తరగతి విద్యార్థులకు ఈనెల 17వతేదీ నుంచి పరీక్షలు జరగనున్నాయి. నియమ, నింబంధనలు పాటిస్తే పరీక్షలు సజావుగా రాయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది॥ (సా॥)	సహర్ సోమ॥ (ఉ॥)
రాయచోటి	6.31	5.03
రాజంపేట	6.28	5.09
పీలేరు	6.29	4.59
మదనపల్లె	6.31	5.03

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.130
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 105 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

రాయచోటి: ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన పరీక్షలను జిల్లా వ్యాప్తంగా 49 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. చివరి రోజైన శనివారం 12,432 మంది జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు 11882 మంది హాజరయ్యారు. 550 మంది పరీక్షలకు గైర్హాజరైనట్లు డీఐఈఓ కృష్ణయ్య తెలిపారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

రాయచోటి: రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సబ్ కలెక్టర్లు, ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, మండల, విలేజ్ సర్వేయర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల్లోని రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. రీ సర్వే విషయంలో మండల సర్వేయర్లు దృష్టి సారించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సర్వేశాఖ ఏడీ భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'స్పర్శ్ అవుట్ రీచ్' ప్రోగ్రాం


కడప రూరల్: కడపలోని జిల్లా సైనిక సంక్షేమ భవనం దగ్గర ఈ నెల 17వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఎక్స్ సర్వీసెస్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించే 'స్పర్శ్ అవుట్ రీచ్'ప్రోగ్రాంను జిల్లాలోని మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని లీగ్ జిల్లా అధ్యక్షులు జడ్ ఫిలిప్స్ తెలిపారు. ఈ సందర్భంగా స్పర్శ్, ఈసీహెచ్ఎస్, కేఎస్బీ, డీజేబులిజీ పెన్షన్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.ఈ నెల 17వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరి

తంబళ్లపల్లె: పాడిరైతులు తమ పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకా తప్పనిసరిగా వేయించాలని స్పెషల్ ఆఫీసర్,పశుసంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. శనివారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాకు 3.33 లక్షల డోసుల గాలికుంటు నివారణ టీకాలు వచ్చాయన్నారు. పశువైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పశువులకు టీకాలు వేస్తున్నారన్నారు. కార్యక్రమం ఈనెల 31వతేదీ వరకు జరుగుతుందన్నారు. బూసెల్లోసిస్ టీకాలు 15వేల డోసులు వచ్చాయన్నారు. 4 నుంచి 8 నెలల వయస్సు పేయదూడలకు టీకాలు వేస్తారాన్నరు. ఇప్పటి వరకు 10 వేల డోసులు వేశామన్నారు. పశుగ్రాసం పెంచుకునేందుకు 175 టన్నుల గడ్డి విత్తనాలను, 75 శాతం సబ్సిడీతో రైతులకు అందజేశామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా బహుళవార్షిక గడ్డి పెంపకానికి రైతులకు 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు వందశాతం రాయితీ ఇచ్చినట్లు తెలిపారు. అంతకుముందు తంబళ్లపల్లెలో జరిగిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమానికి జేడీ హాజరయ్యారు. వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, ఎంఈఓ త్యాగరాజు, పశుసంవర్ధకశాఖ ఏడీ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

కట్టుకుందామా.. వద్దా!

- డెడ్‌లైన్ మార్చి 31 తర్వాత పైసా బిల్లు రాదు
- కేంద్రం నుంచి నిధులు ఆగిపోతాయని ప్రభుత్వ ఉత్తర్వు
- ఏప్రిల్ నుంచి ఇళ్ల నిర్మాణాల భారం లబ్ధిదారులదే
- ఆర్థిక సహాయంపై ఏటూ తేల్చని కూటమి ప్రభుత్వం



తంబళ్లపల్లి నియోజకవర్గం కంటేవారిపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు సందిగ్ధంలో పడ్డాయి. ఇళ్లను కట్టుకుందామా వద్దా, కట్టుకుంటే బిల్లు రావని ఆందోళన. కట్టినా బిల్లు ఇస్తామన్న భరోసా లేదు. దీనితో సొంతింటి కలకు భరోసా కల్పించడంలో కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. మీ ఇంటిని మీరే కట్టుకొండి..మేం నిధులు ఇవ్వలేమంటూ ఇప్పటికే చేతులెత్తేస్తూ రాష్ట్ర గృహనిర్మాణశాఖ ఉత్తర్వు జారీ చేసిన విషయం తెలిసిందే. పేదల ఇళ్లపై కక్ష కట్టిన ప్రభుత్వ నిర్ణయం ఫలితంగా లబ్ధిదారులు నిర్మాణంలోని ఇళ్లను మధ్యలోనే వదిలేయాల్సిన ఆందోళనకర పరిస్థితి కలు గుతోంది. ప్రభుత్వ ఉత్తర్వులతో వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం చేపట్టిన లక్షల ఇళ్ల నిర్మాణాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. తాజాగా ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల్లో ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనపు సహాయం అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. అయితే మార్చి 31 తర్వాత బిల్లులు ఇవ్వలేని పరిస్థితి ఉంటే ఈ ఆర్థిక సహాయం పెంచినా ప్రయోజనం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.

ప్రభుత్వానికి బాధ్యత లేదా

కూటమి ప్రభుత్వం మార్చి తర్వాత ఇళ్లకు నిధులు ఇవ్వమని తేల్చి చెప్పడంతో నిర్మాణంలోని ఇళ్లు ఆగిపోతే ఇప్పటిదాక ఖర్చు చేసిన వేలకోట్లు వృధా అయినట్టు కాదా. ఈ విషయమై లబ్ధిదారులకు ఊరట కలిగేలా కనీస చర్యలు చేపట్టకపోగా కేంద్రం నిధులు ఆగిపోగానే నిర్మాణ భారమంతా లబ్ధిదారునిపై వేయడంతో ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పుకొంటోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన గతంలో ఇళ్లకు ఇచ్చిన నిధులన్నీ లబ్ధిదారులకు రుణంగానే ఇచ్చారు. గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఇచ్చిన రూ.1.80 లక్షలు ఉచితంగా ఇచ్చారు. మహిళా సంఘాల నుంచి అదనంగా ఒక్కో ఇంటికి రూ.30 వేల రుణం కూడా ఇప్పించారు. ఇప్పుడు కేంద్రం నిధులు ఇవ్వదని సాకుగా చూపి కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల బాధ్యత నుంచి తప్పుకుంటోంది. అధికారంలోకి రావడానికి హమీలిచ్చిన వాటినే అమలు చేయని కూటమి ప్రభుత్వం పేదల గూడుపై కక్ష సాధిస్తోంది.

మరో అవకాశం లేదట

పేదలు నిర్మించుకొంటున్న ఇళ్ల నిర్మాణాలు వచ్చే మార్చి 31 లోపు పూర్తి చేసుకోని పక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వవని గృహనిర్మాణశాఖ జారీ చేసిన ఉత్తర్వులో స్పష్టం చేశారు. మొదటి విడత పీఎంఏవై కింద చేపట్టిన ఇళ్లకు మార్చి 31 తర్వాత కేంద్రం నిధులు ఇవ్వదు కాబట్టి లబ్ధిదారులు ఆ లోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి. తర్వాత ఇంటి నిర్మాణ బాధ్యత ప్రభుత్వంపై ఉండదు, నిర్మాణానికయ్యే ఖర్చంతా లబ్ధిదారుడు భరించాల్సిందే అని పేర్కొన్నారు. ఒకవేళ అసంపూర్తి నిర్మాణాలతో ఇంటిని వదిలేసిన లబ్ధిదారులకు రెండో విడత పీఎంఏవైలో ఇళ్ల మంజూరు చేయడం జరగదని పేర్కొన్నారు. రెండో విడత పథకంలో ఇంటి నిర్మాణ విలువ కూడా పెంచడం జరగదని స్పష్టం చేసారు. దీనితో కేంద్రం నిధులు ఇవ్వాలని, మొదటి విడత పీఎంఏవై కింద చేపట్టిన ఇళ్లకు నిధులు ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదించామని, దీనికి కేంద్రం అంగీకరిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేసిన ప్రభుత్వం మార్చి తర్వాత ఇళ్లపై పరిస్థితిపై కనీసం ప్రత్యామ్నాయ చర్యలను సూచించలేదు. అర్ధాంతరంగా ఇళ్ల నిర్మాణాలకు నిధులు నిలిపివేస్తే లబ్ధిదారుల పరిస్థితి ఏమిటని ఆలోచించకుండా నిర్ణయం తీసుకోవడం దారుణం.

ఉచితంగా రూ.1.80 లక్షలతో ఇళ్లు

గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు భారం కావొద్దని నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా ఉచితంగా ఇంటిస్థలాన్ని ఇవ్వడమే కాక నిర్మాణానికి రుణం కాకుండా తిరిగి చెల్లించనవసరం లేకుండా ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. అన్నమయ్యజిల్లాలో 78,221 పక్కా ఇళ్లు మంజూరు చేయగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటికి 34,906 గృహలు పూర్తయ్యాయి. మిగిలిన వి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.826 కోట్లను లబ్ధిదారులు బిల్లులుగా పొందారు. జిల్లాలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో రాయ చోటి నియోజకవర్గంలో 7,968 ఇళ్లు, పీలేరు నియోజకవర్గంలో 4,557 ఇళ్లు, రాజంపేట నియోజకవర్గంలో 3,888 ఇళ్లు, కోడూరు నియోజకవర్గంలో 1,385 ఇళ్లు, తంబళ్లపల్లెలో 3,370 ఇళ్లు, మదనపల్లెలో 5,891 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. మొత్తం 27,059 ఇళ్ల నిర్మాణాలపై మార్చి 31 డెడ్‌లైన్ తీవ్ర ప్రభావం చూపనుంది. ఈనెలాఖరు తర్వాత ఈ నిర్మాణాలు కొనసాగడంపై నీలినీడలు అలుముకుంటున్నాయి.



నిర్మాణం భారం

అంగళ్లుకు చెందిన హర్షద్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రెండేళ్ల క్రితం బ్రాహ్మణ ఒడ్డుపల్లె వద్ద పక్కాగృహం మంజూరు చేశారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టి గోడల వరకు ఇంటిని నిర్మించుకుంది. హౌసింగ్ బిల్లు రూ.1.05 లక్ష, ఉపాధి హామీ కింద రూ.18 వేలు, మహిళా సంఘం నుంచి రూ.35 వేలు అదనంగా ఇచ్చారు. ప్రస్తుతం ఇంటి పని చేపట్టాలంటే బేల్దారికి రోజుకు రూ.1,200, కూలీకి రూ.700 ఇవ్వాలి. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగాయి. ఇటుక, ఇసుక, భవన నిర్మాణ కూలీలు రేట్లు పెరగడంతో పనులు చేపట్టలేకపోతున్నానని వాపోతోంది. కుటుంబం కష్టాలు వెంటాడటంతో గోడల వరకు కట్టి పనులు ఆపేశానని చెబుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అండగా నిలిచి ఆర్థిక సహాయం చేయాలని కోరుతోంది.



ఆగిపోయిన ఇంటి వద్ద లబ్ధిదారు హర్షద్

ప్లాస్టిక్‌రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలి

రాయచోటి అర్బన్: స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లాను ప్లాస్టిక్‌రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని రాష్ట్ర రవాణా, క్రీడల శాఖమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వీరభద్రాలయం ఎదురుగా ఉన్న కూరగాయల మార్కెట్‌లో నిర్వహించిన స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా ప్రత్యేకాధికారి వాడరేవు వినయ్‌చంద్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌లతో కలసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతినెలా 3వ శనివారం జరిగే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రతి ఒక్కరూ పాల్గొని రాయచోటి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని కోరారు.

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. కాలుష్య కారకమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి ప్లాస్టిక్ రహిత జిల్లాగా గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, పలుశాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి

రాయచోటి: రాయచోటిలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి వాడరేవు వినయ్‌చంద్ పాల్గొన్నారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ శ్రీధర్‌తో కలిసి పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వీరభద్రస్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మండపంలో తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సచ్ఛాంధ్ర,స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా డైట్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు పరిశుభ్రతను అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఆర్టీసీ బస్సు కూడలి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యత మున్సిపల్, పంచాయతీ కార్మికులది మాత్రమే కాదని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ ప్రజలందరితో చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్ వాసు, ఆలయ ఈఓ విశ్వనాథ్ తదితరలు పాల్గొన్నారు.



మార్కెట్ పైకప్పును పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ తదితరులు

ఘనంగా ముగిసిన దర్గా ఉత్సవాలు

రామాపురం: మండలంలోని నీలకంఠ్రావుపేట సమీపంలోని దర్గా వద్ద శ్రీ సద్గురు హజరత్ దర్బార్ అలీషావలి, రమతుల్లా అలైబాబా శ్రీ జలీల్ మస్తాన్ వలీ బాబా ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. గురువారం గంధంతో ప్రారంభమైన ఉరుసుకు రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి బెంగళూరుకు చెందిన ఆస్మానిఖత్, నాగపూర్‌కు చెందిన సలీం సైదా మధ్య గొప్ప ఖవాలీ పోటీ జరిగింది. అంతకు ముందు జెండా ఊరేగింపు జరిగింది. శనివారం రాత్రి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. చదివింపులు, చాదర్‌తో దర్గాలో ఫాతేహా నిర్వహించారు.



బాబా సమాధుల వద్ద భక్తుల సందడి

వైభవం.. పుష్పయాగం



స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శనివారం ఉదయం తోమాలసేవ, పవిత్ర జలాలతో స్నపన తిరుమంజనం జరిపారు. అనంతరం సుదూర ప్రాంతాల నుంచి రంగురంగుల పుష్పాలను తెప్పించి గ్రామోత్సవం నిర్వహించారు. వాటితో స్వామివారిని అందంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పుష్పయాగం నిర్వహించారు. స్వామివారికి అలంకరించిన పుష్పాలను అర్చకులు భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

–గుర్రంకొండ

సాంకేతిక విద్యతో బంగారు భవిత

- పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల
- పదో తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం





మదనపల్లెలోని ప్రభుత్వ జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ

మదనపల్లె సిటీ: పదో తరగతి విద్యార్హతతో సాంకేతిక విద్యకు పునాది వేసే పాలిసెట్‌కు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు లభిస్తాయి. మార్చి 17వతేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు మార్చి నెలలో పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు, సాంకేతక నిపుణులు సూచిస్తున్నారు.

గ్రామీణ విద్యార్థులకు ఉపయుక్తం

గ్రామీణ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక చదువులను అందుకోవాలంటే ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. వీరికి తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య లభిస్తే దానిని పునాదిగా చేసుకుని భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది. దీనికి పాలిటెక్నిక్ కోర్సులు వేదికగా నిలుస్తాయి. పాలిసెట్ ద్వారా పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి విలువైన సాంకేతిక విజ్ఞానాన్ని సొంతం చేసుకుని సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. పాలిసెట్–2025కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఏప్రిల్ 15వ తేదీ పాలిటెక్నిక్ కోర్సులకు నిర్వహించే పాలిసెట్ దరఖాస్తులకు తుది గడువు.

ముఖ్యమైన తేదీలు

- దరఖాస్తులకు గడువు: ఏప్రిల్ 15
- ప్రవేశ పరీక్ష : ఏప్రిల్ 30
- ఫలితాలు : మే 10
- కౌన్సెలింగ్ : జూన్ నెలలో

కోర్సుల వివరాలు:

పాలిటెక్నిక్ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. ఆయా కళాశాలల్లో కంప్యూటర్, ఎలక్ట్రానిక్ అండ్ కంప్యూటర్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటో మొబైల్ ఇంజనీరింగ్, అర్కిటెక్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉంటాయి. జిల్లాలో మదనపల్లె (జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ), రాయచోటి, రాజంపేట, కలికిరి, ఓబులవారిపల్లెలలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు నడుస్తున్నాయి. దీంతో పాటు మదనపల్లె సమీపంలోని గోల్డన్‌వ్యాలీ ఇంజనీరింగ్ కాలేజీ, పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సు కాల వ్యవధి మూడు సంవత్సరాలు. దీనిలో భాగంగా ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకునే శిక్షణ సైతం ఇస్తారు. పాలిసెట్ ఎంట్రెన్స్‌లో క్వాలిఫై మార్కులు 35 గా నిర్ణయించారు.

పరీక్ష ఇలా...

పాలిసెట్ పరీక్షను 120 మార్కులకు నిర్వహిస్తారు. వీటిలో గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగా ఎంట్రన్స్ పరీక్ష ఉంటుంది. ఈ ఏడాది మే 10న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష జరుగుతుంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100, ఓసీ,బీసీ విద్యార్థులు రూ.400 పరీక్ష ఫీజు కట్టాలి.

పలు ప్రయోజనాలు: పాలిటెక్నిక్‌లో కోర్సును పూర్తి చేసినా ఉద్యోగం, ఉపాధి సులభంగా దొరుకుతుంది. ఈ కళాశాలల్లో ఇటీవల తరచూ ఉద్యోగ మేళాలను నిర్వహిస్తున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సు చేయడానికి మూడేళ్లకు రూ.13 వేలు ఖర్చువుతుంది. ఆ తర్వాత ఇంజినీరింగ్ సెకండియర్‌లో చేరవచ్చు. లేదా ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు.

ఎన్నో ఉద్యోగావకాశాలు



టెన్త్ తర్వాత పాలిటెక్నిక్ చేస్తే చిన్న వయసులోనే ఉద్యోగావకాశాలు లభి స్తాయి. ఉన్నత విద్యతో పాటు స్వయం ఉపాధికి తోడ్పడుతుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. –ఓబులేసు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, మదనపల్లె

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: జిల్లా ఆర్థికాభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రానున్న ఐదు సంవత్సరాలకు, 2047 నాటికి జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళలు డాక్యుమెంటరీ సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు ప్రణాళికలు రూపొందించుకొని లక్ష్య సాధన కోసం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

రాయచోటి టౌన్: ఈ నెల 17వ తేది నుంచి ప్రారంభం కానున్న పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు 22,355 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 9–30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇన్విజిలేటర్లు పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదన్నారు.అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు మరిన్ని ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. పరీక్షలు ముగిసే వరకు రాత్రి వేళ్లలో ఎలాంటి అంతరాయం రాకుండా విద్యుత్ సరఫరా విద్యుత్ శాఖాధికారులకు సూచించారు.కార్యక్రమంలో ఏఎస్పీ వెంకట్రాది, మున్సిపల్ కమిషనర్ వాసు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్యాంకు ఖాతా నుంచి రూ.4.89 లక్షలు కాజేశారు

బి.కొత్తకోట : గుర్తు తెలియని వ్యక్తి నుంచి మొబైల్‌కు వచ్చిన మేసేజ్ ఓపెన్ చేయగానే రూ.4.89 లక్షలు కాజేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు శనివారం పోలీసులు తెలిపారు. మండలంలోని నాయన బావికి చెందిన దాదం లోకనాథరెడ్డి మొబైల్‌కు గతనెల 14న ఓ మెసేజ్ వచ్చింది. దాన్ని చూసిన లోకనాథరెడ్డి క్లిక్ చేసి తెరిచాడు. అప్పటికప్పుడు గట్టు కెనరా బ్యాంకు ఖాతా నుంచి విడతల వారీగా రూ.4,89,858 నగదు వేరే ఖాతాలకు బదిలీ అయిపోయింది. ఈ విషయాన్ని గుర్తించిన బాధితుడు నెల తర్వాత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

మదనపల్లె : ఆత్మహత్య కేసుకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పోతబోలు పంచాయతీ సిద్దమ్మగారిపల్లెలో ఫిబ్రవరి 20న స్థలం విషయమై వివాదం ఏర్పడగా స్థానికుడైన హసినాబీ కుమారుడు గిరిబాబు (42) పై కొందరు వ్యక్తులు దాడి చేసి కొట్టారు. దీంతో మనస్థాపం చెందిన గిరిబాబు ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలను, వ్యక్తుల వివరాలను సూసైడ్ నోట్‌లో తెలిపాడు. ఆత్మహత్య సంఘటనపై తల్లి హసినాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం శనివారం నిందితులైన మదనపల్లెకు చెందిన గంగులప్ప కుమారుడు అనిల్ (25), గంగులప్ప భార్య అరుణ(45), వారి బంధువైన వెంకటరమణ కుమారుడు శివప్రసాద్ (32)లను దేవతానగర్ వద్ద అరెస్టు చేశామన్నారు. వారిని రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

హార్సిలీహిల్స్ రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుకు శనివారం మరమ్మతు పనులు చేపట్టారు. రహదారి భవనాలశాఖ అధికారులు ఘాట్‌రోడ్డపై దెబ్బతిన్న చోట్ల గుర్తించి వాటికి ప్యాచ్‌లు వేశారు. ఈ రోడ్డు అభివృద్ధి కోసం అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరైతే కొత్తగా రోడ్డు వేయనున్నారు.

నియమావళితోనే సజావుగా పరీక్ష

విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచనలు



స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

మదనపల్లె సిటీ /రాజంపేట టౌన్ : జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు ఈనెల 17వతేదీ నుంచి పరీక్షలు జరగనున్నాయి. నియమ, నింబంధనలు పాటిస్తే పరీక్షలు సజావుగా రాయవచ్చు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రత్యేక సూచనలు..

- విద్యార్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రం ఎక్కడ ఉన్నదన్న విషయాన్ని ఒక రోజు ముందుగా తెలుసుకుని ఆ కేంద్రాన్ని పరిశీలించి రావాలి.
- పరీక్ష రోజు ఉదయం 8.30 గంటలకు కేంద్రానికి చేరుకోవాలి. పరీక్షలు రాయడానికి ప్యాడ్లు తీసుకెళ్లాలి.
- పరీక్షకు అవసరమైన మేరకు పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్, స్కేలు తీసుకెళ్లాలి. పరీక్షా కేంద్రంలో ఇతర విద్యార్థులను అడిగి వారిని ఇబ్బంది పెట్టకూడదు.
- పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు కేటాయించిన స్థానంలో 9 గంటలకే కూర్చోవాలి.
- ఇన్విజిలేటర్ ఇచ్చిన మెయిన్ జావాబుపత్రం, ఓఎంఆర్ పత్రం తమదేనా? కాదా అన్న విషయాన్ని ధ్రువీకరించుకుని పరీక్ష రాయాలి.
- అడిషనల్ జవాబు పత్రాన్ని దారంతో గట్టిగా కట్టి ఇవ్వాలి.
- మెయిన్ జవాబు పత్రంపై ఉన్న నంబర్‌ను, అడిషనల్ జవాబుపత్రం, గ్రాఫ్, మ్యాప్, బిట్ పేపర్లపై తప్పనిసరిగా రాయాలి.

విద్యార్థులు వీటి జోలికి వెళ్లకూడదు..

- పరీక్షా కేంద్రానికి సెల్‌ఫోన్, క్యాలికులేటర్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకు వెళ్లకూడదు.
- హాల్‌టిక్కెట్ తప్ప ఏ విధమైన కాగితాలు వెంట తీసుకువెళ్లకూడదు.
- ఎట్టి పరిస్థితుల్లోనూ జవాబు పత్రాలను పరీక్ష కేంద్రం నుంచి బయటకు తీసుకెళ్లరాదు.
- హాల్‌టిక్కెట్ నంబర్‌ను జవాబుపత్రం, అడిషనల్, బిట్, మ్యాప్, గ్రాఫ్‌ల్లో ఎక్కడా కూడా రాయకూడదు.
- విద్యార్థి పేరుగాని, సంతకం తదితర ఏ విధమైన గుర్తింపు చిహ్నాలు, నినాదాలు జవాబు పత్రాలపై రాయరాదు.

తల్లిదండ్రులు ఇవి పాటించాలి..

- తమ పిల్లలకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందు రోజు చూపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.
- రోజూ పరీక్ష కేంద్రాలకు 8.30 గంటలలోపు చేరుకునేలా చూడాల్సిన బాధ్యత కూడా తల్లిదండ్రులదే. మాల్‌ప్రాక్టీస్ వద్దని సూచించాలి.
- పుకార్లను నమ్మి విద్యార్థులను భయపెట్టకూడదు.

తల్లిదండ్రుల పాత్ర కీలకం



పరీక్షకు ముందు రోజు రాత్రి పొద్దుపోయే వరకు చదవమని పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి చేయకూడదు. పరీక్షా కేంద్రానికి వెళ్లే ముందు హాల్‌టికెట్, పెన్నులు, పెన్సిల్, స్కేల్, రబ్బరు వంటివి ఉన్నాయా లేవా అని తల్లిదండ్రులు ఒకసారి విధిగా పరిశీలించాలి. పరీక్షలు ముగిసే వరకు ఆందోళన కలిగించే విషయాలు పిల్లలకు తెలియకుండా చూసుకోవాలి. పరీక్షల సమయంలో పిల్లలపై ఎట్టి పరిస్థితుల్లో తల్లిదండ్రులు కోప్పడకూడదు. ఏదైనా తప్పు చేస్తే అది తప్పని సున్నితంగా చెప్పే ప్రయత్నం చేయాలి. పిల్లలకు నిజమైన కౌన్సిలర్లు తల్లిదండ్రులే. ఈ విషయాలన్నింటిని తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలి.

– కాశిగారి ప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్, అన్నమాచార్య యూనివర్సిటీ, రాజంపేట

హత్యకు నిరసనగా రాస్తారోకో



మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఎదుట బైఠాయించిన రామకృష్ణ బంధువులు

మదనపల్లె : చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన రామకృష్ణ (55) శనివారం తన సోదరుడు వెంకటరమణ చేతిలో హత్యకు గురికావడాన్ని నిరసిస్తూ మృతుని బంధువులు, గ్రామస్తులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఎదుట నడిరోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. కృష్ణాపురం వద్ద శనివారం స్థానికుడైన రామకృష్ణను పాత కక్షల కారణంగా అతని సోదరుడు వెంకటరమణ కొడవలితో నరికి దాడి చేశాడు. ఈ ఘటనలో కొన ఊపిరితో ఉన్న రామకృష్ణను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. అంబులెన్స్ వాహనంలో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రామకృష్ణ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం రామకృష్ణ మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే ఈ ఘటనకు రాజకీయ రంగు పులుముకోవడంతో, పెద్ద ఎత్తున మృతుని బంధువులు సన్నిహితులు, కృష్ణాపురం గ్రామస్తులు జిల్లా ఆసుపత్రికి చేరుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా ఆసుపత్రి ఎదుట కదిరి రోడ్డులో వాహనాలను అడ్డుగా ఉంచి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. హత్యకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తమ ఫిర్యాదులను సీఐ,ఎస్‌ఐ, డీఎస్పీ పట్టించుకోలేదని వారిని వెంటనే సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ, వన్‌టౌన్ సీఐ ఎరీషా వలీ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని ధర్నా విరమింపజేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆసుపత్రిలోని మృతదేహాన్ని పరిశీలించారు. బాధితుల వద్దకు వచ్చి తగిన న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమరనాథ్‌రెడ్డి, మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు తదితరులు మృతదేహాన్ని పరిశీలించి, మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

'నా బిడ్డను చంపేస్తానంటున్నాడు'



మాట్లాడుతున్న మహిళా మోర్చా నాయకురాలు బాలజ్యోతి, పక్కన చంటిబిడ్డతో బాధితురాలు

మదనపల్లె : కట్టుకున్న భర్త తన బిడ్డను చంపేస్తాను అంటూ బెదిరిస్తూ.. స్వగ్రామానికి రానీయకుండా... వేధింపులకు గురి చేస్తూ చిత్రహింసలు పెడుతున్నాడని... తనకు తన బిడ్డకు రక్షణ కల్పించి కాపాడాలని వివాహిత తన చంటి బిడ్డతో పాటు జన జాగృతి సంస్థ అధ్యక్షురాలు, బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు బాలజ్యోతితో కలిసి శనివారం ప్రెస్‌క్లబ్‌లో తన గోడు విన్నవించింది. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ బి.కొత్తకోట పట్టణానికి చెందిన కృష్ణ, అమృత దంపతులకు భువనేశ్వరి ఒక్కటే కుమార్తె. ఈమె చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందడంతో బి.కొత్తకోటకు చెందిన మేనత్త శంకరమ్మ చేరదీసి పెంచి పెద్ద చేసింది. అయితే అనాథ కావడంతో పెళ్లీడు రాకుండానే బంధువులు 13వ ఏట మైనర్‌గా ఉన్న భువనేశ్వరి(17)కి ములకలచెరువు మండలం, కొక్కంటి క్రాస్ ఎర్రబైరువుపల్లెకు చెందిన శివకుమార్ కు ఇచ్చి బలవంతపు వివాహం జరిపించారు. పెళ్లైన నాటినుంచే భువనేశ్వరికి వేధింపులు మొదలయ్యాయి. భర్త, అత్త, ఆడపడుచు చిత్రహింసలకు గురి చేయడం, తీవ్ర ఇబ్బందులు పెట్టడం చేశారు. ఏడాది తర్వాత భువనేశ్వరి గర్భం దాల్చగా ఇది ఇష్టం లేని అత్తింటి వారు ఇంటి నుంచి గెంటేశారు. అప్పటి నుంచి మేనత్త శంకరమ్మ ఇంటివద్దే కుమార్తె జాహ్నవి (02) కి జన్మనిచ్చింది. అప్పటినుంచి కూలి పనులు చేసుకుంటూ జీవనం చేస్తోంది. కొన్నాళ్ల క్రితం పెద్ద మనుషులు పంచాయితీ చేయడంతో , భర్త శివకుమార్‌తో బి.కొత్తకోటలో వేరు కాపురం పెట్టారు. అయితే చంటి బిడ్డను మేనత్త శంకరమ్మ వద్ద ఉంచారు. భర్త జులాయిగా మారి వేధింపులకు గురి చేయడంతో, కుమార్తెను శంకరమ్మ వద్ద ఉంచి నాలుగు నెలల క్రితం ఉపాధి కోసం బెంగళూరు వెళ్లింది. అప్పటినుంచి బి.కొత్తకోటకు నిన్ను రానివ్వనని ఒకవేళ వస్తే నీతో పాటు నీ బిడ్డను కూడా చంపేస్తానంటూ శివ కుమార్ తీవ్రంగా ప్రతిరోజు బెదిరింపులకు పాల్పడేవాడు. ఈ క్రమంలో శంకరమ్మ వద్ద ఉన్న జాహ్నవిని శివకుమార్ తన బంధువులతో కలిసి వచ్చి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా ఆమె అడ్డుకుంది. ఈనేపథ్యంలో బాధితురాలు భువనేశ్వరి తనకు, తన బిడ్డకు, మేనత్తకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరుతోంది.

అతి వేగం.. రెండు కుటుంబాల్లో విషాదం!





కంటైనర్‌లోనే ప్రాణం విడిచిన డ్రైవర్ భాస్కర్, నుజ్జునుజ్జయిన లారీ

కురబలకోట : అతి వేగం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. కృష్ణపట్నం నుంచి గాలివీడుకు కడప బండలతో లారీ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కంటైనర్ మండలంలోని తానామిట్ట వద్ద శుక్రవారం వేకువ జామున వేగంగా ఢీకొన్న విషయం తెలిసిందే. రెండు వాహనాల ముందు భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. దీంతో ఈ వాహనాలలోని కంటైనర్ డ్రైవర్ భాస్కర్ (36) లారీ క్లీనర్ సయ్యద్ హసన్ (28) క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయి విగతజీవులుగా మారారు. జేసీబీల సాయంతో అతి కష్టం మీద వీరిని బయటకు తీశారు. లారీ డ్రైవర్ నాగేశ్వరరావు (36)కు తీవ్ర గాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు, రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాద కారణాలను పరిశీలించారు. సంఘటన స్థలాన్ని బట్టి పరిశీలిస్తే కంటైనర్ అతి వేగమే ఈ ప్రమాదానికి కారణంగా స్పష్టమవుతోంది. మంగళూరు నుంచి ఎన్‌పీ కుంటలో సోలార్ ప్యానల్‌ను అన్‌లోడు చేసి తిరిగి ఇది ఖాళీగా వెళుతోంది. ముదివేడు సమీపంలోని తానా మిట్ట వద్ద డౌన్‌లో ఇది వేగంగా వెళుతుండగా లోడుతో మెల్లగా మిట్ట ఎక్కుతున్న లారీని ఒక్కసారిగా ఢీకొన్నట్లు సంఘటన స్థలాన్ని బట్టి గమనిస్తే తెలుస్తోంది. దూసుకు వచ్చిన కంటైనర్‌ను పసిగట్టిన లారీ డ్రైవర్ రెప్పపాటులో అప్రమత్తమై లారీని ఒక్కసారిగా పక్కకు తిప్పడంతో అతను తీవ్ర గాయాలతో బయట పడ్డాడు. పక్కనున్న క్లీనర్ మృతి చెందాడు. లారీ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. గేర్ బాక్సు కూడా ఊడి బయట పడిందంటే కంటైనర్ ఎంత వేగంగా వచ్చి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ దుర్ఘటన రెండు కుటుంబాల్లో విషాదానికి కారణమైంది.

కేసులతో వేధించడం సరికాదు

కడప అర్బన్ : ఎక్కడైనా రెండు వర్గాల మధ్య సమస్యలు ఉన్నప్పుడు శాంతియుతంగా ఆ సమస్యను పరిష్కరించాల్సిందిపోయి ఒకే వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని విపరీతమైన సెక్షన్‌లతో కేసులు పెట్టి వేధించడం అనేది చాలా దారుణమని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ అన్నారు. ఇటీవల రాయచోటిలో జరిగిన సంఘటనకు సంబంధించి అక్రమ కేసుల ద్వారా రిమాండ్‌లో ఉన్న బాధితులను శనివారం ఆయన కడప కేంద్ర కారాగారానికి వచ్చి పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేతలు ఇలాంటి ఘటనలపై స్పందించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తపడాలన్నారు.

సారా రహిత జిల్లాగా చేద్దాం



సమవేశంలో మాట్లాడుతున్న జోగేంద్ర

కలకడ : అన్నమయ్య జిల్లాను సారా రహిత జిల్లాగా చేద్దామని, సారాతో వ్యక్తి, కుటుంబం, గ్రామం అభివృద్ధికి దూరమవుతారని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర అన్నారు. శనివారం మండలంలోని దిగువతాండాలో సర్పంచ్ స్వరూప అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. సారా రహిత గ్రామాలతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, ఉన్నత విద్య సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఎక్సైజ్ ఎస్ఐ సీహెచ్‌వీ సుబ్బారెడ్డి, జహీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు





ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడిన ఆదినారాయణ, నాగమల్‌రెడ్డి

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో శనివారం ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కురబలకోట మండలం మట్లివారిపల్లె పంచాయతీ గుడ్లవారిపల్లెకు చెందిన ఆదినారాయణ (55), నాగమల్లిరెడ్డి (54) ద్విచక్రవాహనంలో సీటీఎం నుంచి పెద్దపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలోని బాటమారెమ్మ క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ తిరుపతిరోడ్డులోని ఎర్రగాని మిట్టకు చెందిన మధుకర్‌రెడ్డి (40) వ్యక్తిగత పనులపై పట్టణంలోకి వచ్చి ద్విచక్రవాహనంలో తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలోని ఎస్టేట్ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ఎర్రగుంట్లలో చోరీ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని వినాయకనగర్ కాలనీలో అబ్దుల్ సత్తార్ ఇంటిలో చోరీ జరిగింది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ నరేష్‌కుమార్ శనివారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వచ్చి సంఘటన స్థలంలో వేలి ముద్రలు సేకరించారు. బాధితుతు తెలిపిన వివరాలకు మేరకు ...అబ్దుల్ సత్తార్ రెండు రోజుల క్రితం తన కూతురు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండు జతల కమ్మలు, వెండి పట్టీలు, గజ్జెలు చోరీకి గురైనట్లు గుర్తించాడు.

వాహనాలు సీజ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివారులోని చిన్నచౌక్ గ్రామ సర్వే నెంబర్ 919లో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. రెండు టిప్పర్లు, ఒక ట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తరలిస్తుండగా సీజ్ చేశారు. పట్టుబడిన వాహనాలను కడప నగరంలోని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

అగ్నిప్రమాదంలో మామిడిచెట్లు దగ్ధం



మామిడితోటలో మంటలు

కేవీపల్లె : అగ్నిప్రమాదంలో మామిడిచెట్లు దగ్ధమైన సంఘటన మండలంలోని వగళ్ల పంచాయతీ నారమాకులమిట్టలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషాకు చెందిన మామిడితోట పక్కన ఉన్న కొండకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. మంటలు పక్కనే ఉన్న మామిడి తోటకు వ్యాపించాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో హబీబ్‌బాషా పీలేరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. అయితే అప్పటికే 40 మామిడి చెట్లు, 20 కొబ్బరిచెట్లు, రెండు మోటార్లు, డ్రిప్ పైపులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.


ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తి మృతి



మృతి చెందిన వళ్లెం పాపయ్య

చిట్వేలి : చిట్వేలి గుంజన నది సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమ్మయ్యగారిపల్లి దళితవాడకు చెందిన వళ్లెం పాపయ్య (40) మృతి చెందినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. వివరాల మేరకు పెనగలూరు మండలం, రాచవారిపల్లికి చెందిన నువ్వుల సురేష్ (30) రాజంపేట వైపు నుంచి ట్రాక్టర్ (ఏపీ04బికె2431)లో ఇసుక తీసుకొని చిట్వేలి వైపు వస్తున్నాడు. ఇదే సమయంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న పాపయ్య రాజంపేట వైపు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ట్రాక్టర్ ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

మిద్దెపై నుంచి కిందపడి..



మృతి చెందిన రాజేష్ యాదవ్

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయితీ కొత్తరోడ్డునారాయణపురం వినాయక స్టోన్ క్రషర్‌లో పని చేస్తున్న ఉత్తరప్రదేశ్ వారణాసికి చెందిన రాజేష్‌యాదవ్(40) మద్యం మత్తులో మిద్దెపై నుంచి కిందపడి మృతి చెందాడు. ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు.. రాజేష్ యాదవ్ కొత్తరోడ్డు నారాయణపురంలో ఇంటిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటూ సమీపంలోని వినాయక స్టోన్ క్రషర్‌లో పని చేస్తుండేవాడు. శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా రాత్రి తోటి సిబ్బందితో కలిసి అతిగా మద్యం సేవించి అర్థరాత్రి సమయంలో మద్యం మత్తులో మిద్దెపై నుంచి కిందిపడి మృతి చెందాడు. మృతుడి బంధువులు వచ్చిన వెంటనే వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామన్నారు.

కొనసాగుతున్న పెట్రోలు, డీజిల్ నిక్షేపాల సర్వే

లింగాల : లింగాల మండలంలో డీజిల్, పెట్రోలు నిక్షేపాలను గుర్తించేందుకు అన్వేషణ కొనసాగుతోంది. రైతులకు తెలియకుండా వారి పొలాల్లో బోర్లు వేయబోమని కాంట్రాక్టర్లు మాధవరెడ్డి, సురేష్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అక్షయ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు లేబర్ కాంట్రాక్టు పొంది ఈ అన్వేషణలో భాగంగా లింగాల, తొండూరు మండలాల్లో బోరుబావుల తవ్వకం నిర్వహిస్తున్నామన్నారు. అయితే ఆ గ్రామాల వీఆర్‌ఓలకు, సర్పంచ్‌లకు తెలియజేసి దండోరా వేయించి రైతులకు తెలియపరుస్తామన్నారు.

మోదీ పాలనలో అభివృద్ధి శూన్యం

మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతామోహన్



మాట్లాడుతున్న మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతామోహన్

మదనపల్లె : నరేంద్ర మోదీ మూడవసారి ప్రధానమంత్రి అయినా, 11 ఏళ్ల పాటు దేశాన్ని పాలించినా, ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఆయన మాత్రం పదివేల జతల బట్టలు మార్చాడే తప్ప దేశాభివృద్ధికి చేసింది శూన్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ విమర్శించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రెడ్డి సాహెబ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని పెద్దలు కుల,మత ప్రాంతీయ భేదాలు సృష్టించి విష బీజాలు నాటుతూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ప్రజలు జాగ్రత్త పడకపోతే ముప్పు తప్పదన్నారు. ఎస్సీ వర్గీకరణకు తాను వ్యతిరేకమని, రాజకీయ ప్రయోజనాల కోసం రెండు వర్గాల మధ్య పెద్దలు పెడుతున్న చిచ్చుగా అభివర్ణించారు. వర్గీకరణకు ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయడం తగదన్నారు. మదనపల్లెలోని శానిటోరియం టీబీ ఆసుపత్రి నేడు అధ్వాన స్థితికి చేరుకోవడం చాలా బాధాకరమన్నారు. అదేవిధంగా మదనపల్లి బీటీ కాలేజ్ కూడా నేడు ఇదే స్థితికి చేరడానికి నాయకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. శానిటోరియం టీబి ఆసుపత్రి, బీటీ కాలేజ్ లను పునరుద్ధరించాలన్నారు.

రాజకీయ కక్షతోనే నిప్పంటించారు



బాధితులను పరామర్శిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్లు ఖాజా, బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక పాత బస్టాండ్‌లోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అయిన కొండారెడ్డి, సుధాకర్ షాపులు దగ్ధం కావడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కేవలం రాజకీయ కక్ష సాధింపే ఈ సంఘటనకు కారణమని భావిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యర్తలు కొండారెడ్డి, సుధాకర్ పాతబస్టాండ్‌లో షాపులు నిర్వహిస్తున్నారు. కొండారెడ్డి కూల్ డ్రింక్ షాపు, సుధాకర్ ఫ్యాన్సీ స్టోర్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఊహించని రీతిలో శుక్రవారం అర్థరాత్రి సమయంలో ఇరువురి దుకాణాలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ నెల 12న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన యువత పోరు కార్యక్రమానికి కొండారెడ్డి కార్యకర్తలతో కలసి వాహనాల్లో కడపకు వెళ్లారు. ఈ కారణంగానే వీరి షాపులకు నిప్పు అంటించారని తెలుస్తోంది. శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటన ఎలా జరిగిందని బాధితులను అడిగి తెలుసుకున్నారు.

మహిళపై దాడి కేసులో నిందితుడి అరెస్టు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, నిందితుడితో సీఐ, ఎస్ఐ

కమలాపురం : కమలాపురం పట్టణం గిడ్డంగివీధిలో ఈ నెల 13వ తేదీన లక్ష్మీదేవి అనే మహిళపై జరిగిన దాడి కేసులో నిందితుడు ఆకుల రెడ్డి నవీన్‌ను అరెస్ట్ చేసినట్లు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన దాడికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. నిందితుడు నవీన్ ఇంటర్ వరకు చదువుకుని ఏడాది పాటు ఏఐఎల్ డిక్సన్ కంపెనీలో పని చేసి మానేశాడు. అనంతరం క్రికెట్ బెట్టింగు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో పాటు మద్యం తదితర వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో అప్పులు చేసి తీర్చలేని స్థితికి చేరుకున్నాడు. తన ఇంటి పక్కనే ఉన్న కరంగుడి లక్ష్మీదేవి వద్ద తన మొబైల్‌ను కుదువ పెట్టి రూ.30వేలు అప్పు తీసుకున్నాడు. సెల్‌ఫోన్ కూడా విడిపించుకోలేక లక్ష్మీదేవిని చంపేసి ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు ఒంటిపై ఉన్న నల్లపూసల దండ, తాళిబొట్టు సరుడులను బలవంతంగా లాక్కుని వెళ్లి వాటిని అమ్ముకుని అప్పు తీర్చాలనుకున్నాడు. దీంతో ఈ నెల 13వ తేదీ ఉదయం ఇంట్లో లక్ష్మీదేవి ఒంటరిగా ఉన్న విషయం తెలుసుకుని, ఇంట్లోకి చొరబడి ఆమెను కత్తితో పొడిచి మెడలో ఉన్న బంగారు నల్లపూసల దండ, తాళిబొట్టు సరుడు బలవంతంగా లాక్కొని పారిపోయాడు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన సీఐ ఎస్‌కే రోషన్, సీసీఎస్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది తో కలసి దర్యాప్తు చేపట్టి శనివారం వల్లూరు మండలం తోళ్ల గంగన్నపల్లె వద్ద నిందితుడిని అరెస్ట్ చేశారు. అలాగే అతడి వద్ద నుంచి బంగారు తాళిబొట్టు సరుడు, నల్లపూసల దండతో పాటు, నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. కాగా కేవలం రెండు రోజుల్లోనే దాడి కేసులో నిందితుడుని పట్టుకుని అరెస్ట్ చేసిన సీఐ రోషన్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి, సిబ్బందిని ఆయన అభినందించారు. అలాగే వారికి రివార్డులకు సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు.